క్లుప్తంగా

నేడు సూర్యనమస్కారాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా సూర్యనమస్కారాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి రథసప్తమి వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు సూర్యనమస్కారాలు చేసి, పాయస నివేదన చేయనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

నాదసంగమం మహోత్సవాలు ప్రారంభం



వాగ్గేయకార కీర్తనలను గానం చేస్తున్న విజయలక్ష్మి బృందం

విజయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించే నాద సంగమం సాంస్కృతిక మహోత్సవాలు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా నెమ్మలూరి చంద్రశేఖర్ భక్తి రంజని, విజయనగరానికి చెందిన జీ రామలక్ష్మి బృందం వాగ్గేయకార సంకీర్తనం భక్తి రసప్రధానంగా సాగాయి. చివరిగా జ్యోస్యుల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై అమ్ముల ప్రసాద్ సహకరించారు. నాదసంగమం కార్యక్రమాలను బాలా త్రిపురసుందరి, బుర్రా పద్మనాభశాస్త్రి పర్యవేక్షించారు.

అధ్యాపకుడికి పురస్కారం



కలెక్టర్ ఢిల్లీరావు నుంచి పురస్కారం అందుకున్న బాలసుబ్రహ్మణ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దేవరకొండ వెంకట సూర్య బాలసుబ్రహ్మణ్యం గణతంత్రదినోత్సవంలో భాగంగా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు నుంచి గురువారం పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు పురస్కారం అందుకున్న బాలసుబ్రహ్మణ్యాన్ని అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళా వేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు బద్రీనాథ్‌బాబు, ఇతర అర్చకులు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ భ్రమరాంబ, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణంలో పాల్గొన్న, వీక్షించిన భక్తుల ఇంట సకల శుభాలు కలుగుతాయని, సంతాన యోగం, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

అలరించిన భక్త రంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలువురు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వరవీణ మ్యూజిక్ అకాడమీకి చెందిన శాంతిచంద్రిక, దుర్గ ఐశ్వర్య, శ్రియ, రాధశ్రీ పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళా బృంద సభ్యులకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

శ్యామలాదేవికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్యామలాదేవి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని లలితాంబికా పీఠంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షణలో ఉదయం అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు చేశారు. శ్రీచక్రానికి విశేష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం పీఠం కన్వీనర్ చైతన్య శ్యామలాదేవి అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పేదల జీవన ప్రమాణాల పెంపుదలకు కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పేదల జీవన ప్రమాణాల పెంపుదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 23వ డివిజన్ 93వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డితో కలిసి సూర్యనారాయణ రావు వీధిలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వ్యాపార వర్గాల సూచనలు, సలహాలు స్వీకరించారు. వీటన్నింటిపై యాక్షన్ టేకెన్ రిపోర్టును సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని మల్లాది విష్ణు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సచివాలయ పరిధిలో రూ.2.99 కోట్ల సంక్షేమం

నవరత్నాల పథకాల ద్వారా 93వ వార్డు సచివాలయ పరిధిలో మూడేళ్లలో రూ.2.99 కోట్ల సంక్షేమం అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 175 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక, 104 మందికి అమ్మఒడి, 57 మందికి విద్యాదీవెన, వసతి దీవెన 70 మందికి చేయూత 13 మందికి కాపు నేస్తం, ఎనిమిది మందికి వాహనమిత్ర, 13 మందికి జగనన్న తోడు కింద ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు.

ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలి

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మనరాష్ట్రంలో చక్కని పాలన జరుగుతోందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామికీకరణ, విద్య, వైద్యం, పాలన రంగాల్లో మెరుగైన ప్రగతి కోసం ఈ ప్రభుత్వం బహుముఖంగా పనిచేస్తోందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని ప్రజలలో చులకన చేసేందుకు కొన్ని దుష్టశక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఓవైపు చంద్రబాబు పుత్రుడు, మరోవైపు దత్తపుత్రుడు రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే పనిలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. 2014లో అధికారంలో ఉన్నప్పుడు విమానాలు, విదేశాలు తప్ప ప్రజల కష్టాలు ఏనాడూ గుర్తించని నాయకులు అధికారం పోయే సరికి రోడ్ల మీదకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. పదవుల్లో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం టీడీపీ నేతలకే చెల్లిందన్నారు. ప్రజల కోసం చేసేది పాదయాత్ర అని.. పదవుల కోసం చేసేది ప్రాథేయ యాత్ర అవుతుందన్నారు. రాష్ట్రంలో ఒక సిద్ధాంతం, అజెండా అంటూ లేని పార్టీ ఏదైనా ఉందంటే.. అది జనసేన పార్టీయే నని మల్లాది విష్ణు విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, నాయకులు చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు, పసుమర్తి రాజేష్, ఆత్మకూరి వెంకట అప్పారావు, గాజుల శేషఙ్ఞ, చాందిని పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలోత్సవం

హాజరుకానున్న 12 వేల మంది బాలబాలికలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చలవాది మల్లికార్జునరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అమరావతి బాలోత్సవం శనివారం నుంచి మూడు రోజుల పాటు విజయవాడ పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు, అధ్యక్షుడు ఎస్వీ రామరాజు చెప్పారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బాలబాలికల్లో సృజనాత్మకశక్తిని వెలికి తీయాలని, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సాహించాలనే లక్ష్యంతో అమరావతి బాలోత్సవం గడిచిన ఐదు సంవత్సరాల నుంచి వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సుమారు 200 విద్యాసంస్థల నుంచి 12 వేల మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 29వ తేదీన బాలోత్సవం ఐదో పిల్లల పండగను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభ సభకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, బాలోత్సవం వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు, పుట్టగుంట సతీష్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. 31వ తేదీన జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మొత్తం 57 విద్యా, సాంస్కృతిక అంశాలపై రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ మూడు రోజులపాటు పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా 'విద్యార్థులు సాంస్కృతిక వికాసం', 'నేటి విద్యా వ్యవస్థ', 'శాస్త్రీయ ఆలోచన', 'నిత్య జీవితంలో సైన్స్' అనే అంశాలపై కేబీఎన్ కళాశాల సెమినార్ హాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. సమావేశంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కొండలరావు, ఇంజినీరింగ్ కళాశాల కోశాధికారి కొత్త మాసు వెంకటేశ్వరరావు, పారిశ్రామిక వేత్త వెంకట్రారావు, అమరావతి బాలోత్సవం సభ్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎస్.విద్యాకన్నా, వెన్నా వల్లభరావు, మురళీకృష్ణ, జ్యోత్స్న, సుబ్బారావు, వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న శ్రీహరిరావు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్‌డే, 4వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ సైంటిస్టు థామస్ అల్వా ఎడిసన్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ధనేకుల వెంకట సత్యనారాయణ, కె.శ్రీహరిరావు మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టి ప్రపంచానికి వెలుగులు ఇచ్చిన రోజైన జనవరి 27వ తేదీను ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మంది ఎలక్ట్రికల్ కార్మికులు ఉన్నారని వారి సంక్షేమం కోసం అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వానికి ఎలక్ట్రికల్ కార్మికులకు వారధిగా పనిచేస్తున్నామని అన్నారు. అసోసియేషన్ కన్వీనర్ వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు బీ మల్లేశ్వరరావు, గౌరవ సలహాదారులు కె.వెంకట్రావు, బుజ్జి, మాజీ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం యాక్సిడెంట్ అయిన ఎలక్ట్రికల్ కార్మికులు, కార్మికుల పిల్లలకు రూ.70వేల ప్రోత్సాహకాలను అందజేశారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం

ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.శ్రీహరిరావు, ఉపాధ్యక్షులుగా ఎం.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.మల్లేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన ఉమామహేశ్వరరావు



కలెక్టర్ ఢిల్లీరావుకు మొక్కను అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జి.ఉమామహేశ్వరరావు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీసీఎల్ఏలో అడిషనల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇటీవలే డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఉమామహేశ్వరరావును సమగ్ర శిక్షా విభాగంలో అదనపు పథక సమన్వయకర్తగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఉమామహేశ్వరరావు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు.

చెత్త తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో రోడ్డు పక్కన, డివైడర్‌వల్ల పేరుకు పోయిన చెత్త, పిచ్చి మొక్కలను శుక్రవారం పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

భవన నిర్మాణ కూలీ అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవన నిర్మాణ కూలీ అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు గొల్లపూడి ఔట్ ఏజెన్సీ ఎస్సీవాడకు చెందిన కొండలరావు భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్నాడు. రోజూ ఉదయం 6 గంటలకు పనికి వెళ్లి రాత్రి 7 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 22వ తేదీన కూలిపనులకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన అతడి భార్య అరుణ ఇరుగుపొరుగు వారిని, బంధువులను ఆరా తీసింది. అతడి ఆచూకీ తెలియకపోవడంతో భవానీపురం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి వెళ్లిన తర్వాత తనకు ఫోన్ కూడా చేయలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురులో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు కృష్ణానది శివలింగాల ఘాట్ వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులో కి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,500 సొమ్ము, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు



పోస్టర్ ఆవిష్కరణలో సీవీకే ప్రసాద్, కోటేశ్వరరావు, శేషప్రసాద్ శర్మ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని మహితా పబ్లిక్ స్కూల్ కృష్ణలంక, ప్రియదర్శిని స్కూల్ పంజాసెంటర్, సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటనరీ స్కూల్‌లో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ కన్వీనర్ సీవీకే ప్రసాద్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉదయం తొమ్మిది గంటలకు సూర్యారాధన, సూర్యనమస్కారాలు, సామూహిక ఆదిత్యహృదయం పారాయణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కార్యక్రమంలో ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. వేడుకల పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ధర్మప్రచారమండలి సభ్యుడు బీవీ కోటేశ్వరరావు, విశ్వధర్మ పరిషత్ సభ్యులు ఉప్పలూరు శేషప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ దేవీనగర్, జీవీఆర్‌నగర్, పప్పులమిల్లు ఫీడర్ పరిధిలో విద్యుత్‌వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, దేవీనగర్ ఒకటో లైన్ నుంచి 8వ లైన్ వరకు, ట్రెండ్ సెట్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయక నగర్, పప్పుల మిల్లు, లెక్చరర్స్ కాలనీ, నేతాజీ కాలనీ, వీవీ నరసరాజు రోడ్డు, తూనుగుంట్ల రమాదేవి స్కూల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్, అయోధ్యనగర్ పరిధిలో విద్యుత్‌వైర్ల మరమ్మతులు, కొత్తలైన్ ఏర్పాటు దృష్ట్యా శనివారం నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేదారేశ్వర పేట, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగశ్వరపేట మొత్తం ఏరియా, శాంతినగర్, అయోధ్య నగర్ మొత్తం ఏరియా, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలలో ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒరుగు వారి వీధి, దేవాలయం వీధి ,సుబ్బరాజు వీధి, గవర్నమెంట్ ప్రెస్ ఏరియా, అంబేడ్కర్ కాలనీ , చల్లపల్లి వారి వీధి, గిరి వీధి ,పాపరాజు వీధి, కనకరాజు వీధి, వానపాల వారి వీధి, ఏఎస్ రాజు రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఆగిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మార్కెట్‌కు 30లక్షల టన్నుల గోధుమలు, బియ్యం



మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ ఏపీ రీజియన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషీ

పటమట(విజయవాడతూర్పు): ఆహార ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ధోరణి నియంత్రణకు భారత ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌కు 30లక్షల మెట్రిక్‌టన్నుల గోధుమలు, బియ్యాన్ని కేటాయించిందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఏపీ రీజియన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషీ పేర్కొన్నారు. ఆయన పటమట కృష్ణానగర్‌లోని కార్యాలయంలో రాష్ట్ర పిండిమిల్లుల సంఘం, ఇతర ప్రైవేటు వ్యాపారస్తులు, బల్క్ కొనుగోలుదారులు, గోధుమ ఉత్పత్తుల తయారీదారులు, సహకార సంఘాలు, స్టాక్ హోల్డర్స్‌తో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాఖ్యలు, బహిరంగ మార్కెట్ పథకం(దేశీయ) ద్వారా గోధుమలు, బియ్యం టెండర్ ద్వారా అమ్మకానికి సంబంధించిన ధరపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆహార ధాన్యాల సరఫరా కోసం ఎఫ్‌సీఐ విశాఖపట్నం, పోర్టుబ్లెయరు నుంచి మాత్రమే ఈవేలం ద్వారా గోధుమలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రోలర్ ఫ్లోర్‌మిల్లుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది నుంచి రాజమండ్రి, విశాఖపట్నం, హనుమాన్ జంక్షన్‌లో కూడా రేక్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ముగిసిన సంప్రదాయ నృత్యపోటీలు



కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: శ్రీనృత్య కళానిలయం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కూచిపూడి, జానపద నృత్యపోటీలు శుక్రవారం ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన నృత్య కళాకారులు జూనియర్ సోలో విభాగంలో 75 మంది పోటీ పడ్డారు. త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ కృతులతోపాటు, పద కవితా పితామహుడు అన్నమయ్య, రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి శైలశ్రీ మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాలపట్ల నేటి బాలబాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈ ఏడాది సబ్ జూనియర్, జూనియర్ విభాగాలలో మాత్రమే పోటీలను నిర్వహించామన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు.

శేరినరసన్నపాలెంలోచోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తల్లిదండ్రులకు చెందిన నివాసంలో చోరీ జరిగింది. 15 రోజుల క్రితం బాపులపాడు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కైలే జ్ఞానమణి, సంజీవరావు దంపతులు పామర్రులోని కుమారుడు అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లారు. కొద్దిరోజులుగా ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన దొంగలు గురువారం అర్ధ రాత్రి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఇంటిని శుభ్రపర్చేందుకు వచ్చిన పనిమనిషి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తల్లిదండ్రులకు సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన కైలే జ్ఞానమణి, సంజీవరావు ఇంటిని పరిశీలించారు. నాలుగు బంగారు ఉంగరాలు, రెండు చెవిపోగులతో పాటుగా రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఎమ్మెల్యే సోదరుడు కైలే జగదీష్ ఈ ఘటనపై వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గన్నవరం డీఎస్పీ విజయ్‌పాల్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

టూ వీలర్స్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొండా



(విజయవాడతూర్పు): కృష్ణలంకకు చెందిన జగన్నాథం దుర్గాప్రసాద్(కొండా) విజయవాడ టూ వీలర్స్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం కృష్ణలంక, 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషును ఆయన మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా అడపా శేషు కొండాను దుశ్శాలవాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అట్కిన్‌సన్ స్కూల్‌లో 'పరీక్షా పే చర్చ'



పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' 2023 ప్రత్యక్ష ప్రసారాన్ని గొల్లపూడి అట్కిన్‌సన్ పాఠశాల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఎంతో ఆసక్తిగా వీక్షించారు. పరీక్షల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలను గురించి అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమా పావని మాట్లాడుతూ పరీక్షల సమయంలో చిన్నారులు భయం, ఒత్తిడిక లోనుకావడం సహజమని, వాటిని అధిగమించాలంటే యోగా, ధ్యానం చేడం ద్వారా మనసును నియంత్రించవచ్చన్నారు. తద్వారా ఉత్తమ ఫలితాలను సాధించగలమని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో మనసుపెట్టి విద్యపై దృష్టి సారిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పరీక్ష అనేది జీవితానికి ముగింపు కాదని, ఫలితాల గురించి అతిగా ఆలోచించకూడదని చెప్పారు. విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులలో ఏర్పడే భయాందోళనలను పోగొట్టేందుకే ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ' పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు.

● మంచు దుప్పటి

ఉదయం ఎనిమిది గంటలు దాటినా మంచు తీవ్రత తగ్గడం లేదు. పంట పొలాల్లో, ప్రధాన రహదారుల్లో పొగ మంచు కమ్మేస్తోంది. కంకిపాడు వద్ద పొలాలు, రోడ్లపై కమ్ముకున్న మంచు దృశ్యాలను శుక్రవాం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కంకిపాడు నుంచి బందరు వెళ్లే ప్రధాన రహదారి పై దట్టంగా కమ్ముకున్న మంచులో వెళుతున్న వాహనాలు



కంకిపాడు వద్ద పచ్చని పంట పొలాల్లో కమ్ముకున్న మంచు